ప్రమాదకరంగా అలర్ట్ స్ట్రిప్స్ !

● తీవ్ర ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులు ● నడుము, వెన్నుపూస, మెడ నొప్పులు వస్తున్నాయని.. ● స్పీడ్ బ్రేకర్లే మేలంటున్న ప్రజలు



ప్రమాదకరంగా మారిన అలర్ట్ స్ట్రిప్స్

రామంతాపూర్ : రోడ్డుపై వెళ్లే వాహనాల వేగం తగ్గించేందుకు స్పీడ్ బ్రేకర్లకు బదులుగా రోడ్లపై అలర్ట్ స్ట్రిప్స్ వేస్తున్నారు. ఈ అలర్ట్ స్ట్రిప్స్ రామంతాపూర్ నుంచి ఉప్పల్‌కు వెళ్లే ప్రధాన రహదారి, అదే విధంగా వీధి నెంబర్ -8 హబ్సిగూడ రహదారిలో వివిధ చోట్ల వందల సంఖ్యలో ఏర్పాటు చేశారు.

శాస్త్రీయ పద్ధతిలో లేకపోవడంతో..

ఈ స్ట్రిప్స్‌ను శాస్త్రీయ పద్ధతిలో నిర్ణీత ఎత్తులో నిర్మించకుండా అంగుళం పైనే ఎత్తుగా ఏర్పాటు చేశారు. దీంతో ఈ రహదారుల మీదుగా వెళ్లే వాహనదారులకు ఈ అలర్ట్‌స్ట్రిప్స్‌పై ప్రయాణించేటపుడు శరీరం మొత్తం దడదడలాడుతూ కప్పించుకుపోతోంది.

అదుపుతప్పి ప్రమాదాలు..

ఈ స్ట్రిప్స్‌పై ప్రయాణించే స్కూటీ, బైక్ సహా ఇతర ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు అదుపుతప్పి గాయాలపాలవుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా మెడ నొప్పులు ఉన్న వృద్ధులైతే ఈ స్ట్రిప్స్ ఉన్న రోడ్లపై ఆసుపత్రి పాలు కావాల్సిందే. కొంత మందికి నడుము నొప్పులతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

దెబ్బతింటున్న వాహనాలు..

ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఇతర వాహనాలు తరచుగా ఈ అలర్ట్ స్ట్రిప్స్‌పై ప్రయాణిస్తుంటే వాహనాలు టైర్లతో పాటు సస్పెన్షన్స్ పాడైపోవడంతో పాటు వాహనాల్లోని ఇతర భాగాలు కదిలి చెడిపోతున్నాయని, వాహనదారులు వాపోతున్నారు. వెంటనే ఈ రహదారులపై ఉన్న అలర్ట్ స్ట్రిప్స్‌ను తొలగించి స్పీడ్ బ్రేకర్లు వేస్తే బాగుంటుందని వాహనదారులు కోరుతున్నారు.

స్ట్రిప్స్‌ను తొలగించి స్పీడ్ బ్రేకర్లు వేయాలి



రామంతాపూర్ ప్రధాన రహదారి నుంచి ఉప్పల్ వైపు వెళ్లే రహదారితో పాటు వీధినెంబర్-8, హబ్సిగూడ రోడ్డులో వందల సంఖ్యలో స్పీడ్ బ్రేకర్లకు బదులుగా అలర్ట్ స్ట్రిప్స్ వేశారు. వీటిని సరైన పద్ధతిలో ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి అదుపుతప్పి కిందపడి ప్రమాదాలకు గురౌతున్నారు. అశాస్త్రీయంగా ఉన్న డేంజర్ బెల్స్ మోగిస్తున్న ఈ స్ట్రిప్స్‌ను తొలగించి స్పీడ్ బ్రేకర్లు వేయాలి. దీనికోసం ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

– ఎర్రం శ్రీనివాస్, ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం



ప్రశంసాపత్రాలను అందజేసిన డీఎం కవిత

బోడుప్పల్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి సమష్టిగా కృషి చేద్దామని చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో మంగళవారం ప్రగతిచక్రం త్రైమాసిక పురస్కారాల్లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ఆమె నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసినప్పుడే ఆదాయం సమకూరుతుందన్నారు. డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడిపి రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కృషి చేయాలన్నారు. సమయపాలన పాటించి ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్లు చంద్రమౌళి, శేషిరెడ్డి, ఈడబ్ల్యూబీ సభ్యులు పద్మావతి, వెంకటేష్ పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



వీఎన్‌రెడ్డినగర్‌లో బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: చాలా ఏళ్లుగా ఉన్న మురుగు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె కాలనీలో చేపట్టిన బాక్స్‌డ్రైన్ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్టామ్‌వాటర్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, బాక్స్‌డ్రైన్ పనులు పూర్తైతే వరద, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, కనకరాజుగౌడ్, రాంచంద్రయ్య, వాసుదేవరెడ్డి, రంగారెడ్డి, వీరన్న, నగేష్, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్‌చారి, తిరుపతయ్య తదితరులున్నారు.

పార్టీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం



చీఫ్ విప్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రామంతాపూర్: నియోజకవర్గంలోని ఏ – బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తన పేరును పరిశీలించాలని మంగళవారం రామంతాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్‌నేత సుర్వి మురళీగౌడ్, సీనియర్ కాంగ్రెస్‌నేతలు, మాజీ కార్పొరేటర్లతో కలిసి ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పదవుల్లో నియామకానికి బీసీలకు ప్రాధాన్యత నిస్తున్నట్లు పేర్కొన్నారన్నారు. మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, రాఘవరెడ్డి, వినోద్ తదితరులున్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



సర్టిఫికెట్లతో విద్యార్థినులు

బోడుప్పల్: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. జేజీఆర్ ఉన్నత పాఠశాల యాజమాన్యం 2024–25 విద్యాసంవత్సరానికి నర్సరీ నుంచి 9వ తరగతి వరకు వార్షిక ఫలితాలను వెల్లడించారు. ప్రతి తరగతిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పాఠశాల ఇన్‌చార్జి విజయ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీ జేఏసీ కన్వీనర్‌గా మహ్మద్ సిద్ధిఖీ



మల్లాపూర్: ముస్లిం, మైనార్టీ జేఏసీ నాచారం డివిజన్ కన్వీనర్‌గా మహ్మద్ సిద్ధిఖీ (సోను) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జేఏసీ సలహాదారులు నల్లా రాధాకృష్ణ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ముస్లింల ప్రధాన సమస్యలపై పోరాడతానన్నారు. దళిత జేఏసీ కన్వీనర్ కరాటే శ్రీరామ్, బీసీ జేఏసీ కన్వీనర్ రాజబాబు, డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ దొంతుల శ్రీనివాస్, ఎమ్మార్పీస్ నేత అంజిమాదిగ, అమరేందర్‌రావు తదితరులున్నారు.

వెండి తోరణాల బహూకరణ



సమర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మల్కాజిగిరి: ఆనంద్ బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలోని మూలవిరాట్‌కు చక్రిపురం రెడ్డి కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డి, సాహితిరెడ్డిలు సుమారు కిలో వెండితో తయారు చేయించిన తోరణాలను కానుకగా అందజేశారని, ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి అలంకరించారు.ఆలయం దాత కుటుంబసభ్యులను సన్మానించి శేషవస్త్రాలను అందజేశారు.

తొలిరోజు ప్రశాంతంగా ‘ఎప్‌సెట్’



పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల కుటుంబసభ్యులు

మల్కాజిగిరి: ‘ఎప్‌సెట్’ పరీక్ష మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయాన్ డిజిటల్ జోన్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. మంగళ, బుధవారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షలు జరగనుండగా శుక్ర, శని, ఆదివారాల్లో ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే విద్యార్థులు చేరుకున్నారు. మొత్తం 1970 మంది విద్యార్థులకు 1826 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పుస్తెమెట్టెల అందజేత

మౌలాలి: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువతికి సామాజిక సేవకుడు పిట్టల నాగరాజు పుస్తె మెట్టెలు అందజేశారు. యువతి పెళ్లి కానుకను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేతుల మీదుగా వీటిని అందజేశారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు పీఎస్ఆర్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుంది



సామూహిక భోజనం చేస్తున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పేదలకు సన్నబియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీనియర్ నాయకుడు కొత్త అంజిరెడ్డి ఆధ్వర్యంలో జమ్మిగడ్డలోని లబ్ధిదారు పద్మ ఇంట్లో ఏర్పాటు చేసిన సామూహిక భోజనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు సన్నబియ్యం అందించాలనే సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప ఆలోచనతో నేడు రూ.2 కిలో బియ్యం పథకానికి కొత్తరూపు వచ్చిందన్నారు. ప్రతి పేదవాడు రెండు పూటల కడుపునిండా భోజనం చేసే పరిస్థితులు తీసుకొచ్చిన ఘనత సీఎం సొంతమని కొనియాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. ఉచితబస్సు, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ.. అందరి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కౌెట్టి ప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ విఠల్‌నాయక్, సీతారాంరెడ్డి, అల్లూరయ్య, రాజు, రాజేంద్రన్, అజీజ్, లింగం, భూపాల్‌రెడ్డి, శ్రీను, నర్సింహ్మా, అనిల్, గుణశేఖర్, రామలింగం, పెద్ది నాగరాజు, సందీప్‌గౌడ్, కిరణ్, ప్రకాష్ తదితరులున్నారు.

నేడు చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద ధర్నా

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టర్మినల్ ప్రారంభమై 3 నెలలు గడుస్తున్నా స్టేషన్‌కు రవాణాసౌకర్యం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ నేడు చర్లపల్లి రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు బీజేపీ శ్రేణులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. ప్రధాన రహదారి వెంట వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, అన్ని డిపోల నుంచి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు అనుసంధానంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్న ప్రధాన డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ ధర్నాలో బీజేపీ శ్రేణులు, స్థానికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

2 నుంచి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

గౌతంనగర్: డివిజన్ జేఎల్ఎన్ఎస్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ, మహంకాళి, ఎల్లమ్మ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఈనెల 2 నుంచి 4 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పహల్గాం మృతులకు నివాళి



మల్లాపూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

మల్లాపూర్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులకు బీజేపీనేత ఎనుముల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తా నుంచి మల్లాపూర్ శివహోటల్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, శైలేష్‌రెడ్డి, కృష్ణయాదవ్, ఆంజనేయులు, ధర్మారెడ్డి, మల్కయ్య, యాదగిరిగౌడ్, రవీందర్‌సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, సాంబశివరావు, శ్రీకాంత్‌రెడ్డి, మర్రి మోహన్‌రెడ్డి, శ్రీను, రవీందర్ యాదవ్, ఆనంద్, నిర్మల, శ్యామల, సబిత తదితరులు పాల్గొన్నారు.

‘ఉగ్రదాడిపై మొసలి కన్నీరు’ !

జీహెచ్ఎంసీ మేయర్‌పై మల్కాజిగిరి కార్పొరేటర్ ఆరోపణలు

లక్డీకాపూల్: ‘నగరంలో టెర్రరిస్టులకు బర్త్ సర్టిఫికెట్స్ జారీ చేయడాన్ని వెంటనే నిలిపేయాలని’ మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పహల్గాం మృతులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బల్దియా కమిషనర్ ఆధ్వర్యంలో జరగాల్సిన కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ నిర్వహించడం సరికాదన్నారు. ఆర్భాటంగా పహల్గాం అమరులకు హడావిడిగా నివాళులర్పించడాన్ని తప్పుపట్టారు. నిరసన కార్యక్రమంలో స్టేజీమీద ఉన్న శ్రద్ధ అమరుల ఫోటోల మీద లేదన్నారు. అమరుల అందరి ఫోటోలను ఏర్పాటు చేయలేదన్నారు. బల్దియాలో బర్త్ సర్టిఫికెట్ల స్కామ్ జరుగుతుందని ఆరోపించారు. ఓ సామాజిక వర్గం ఎక్కువ ఉన్న ప్రదేశంలో పదే పదే అవకతవకలు చోటు చేసుకుంటున్నా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం



పురస్కారాలతో ఆర్టీసీ సిబ్బంది

మేడిపల్లి: ఉప్పల్ డిపోలో టీజీఎస్‌ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ ప్రగతి చక్రం మూడో త్రైమాసిక పురస్కారాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఉప్పల్ డిపో మేనేజర్ రాజశేఖర్ హాజరై ఆర్టీసీలో మెరుగైన సేవలందించిన ఉద్యోగులను శాలువాలతో సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు జీతాలు ఇబ్బందుల నుంచి నేడు 1న జీతాలు తీసుకునే స్థాయికి చేరడానికి కృషి చేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ (ఐపీఎస్) అని కొనియాడారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌తో పాటు, తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దారన్నారు. సికింద్రాబాద్ రీజియన్ డీఎంలు, పీఓలు, ఆర్టీసీ సిబ్బంది, వివిధ విభాగాల ఉద్యోగులు తదితరులున్నారు.

నిబంధనలు పాటించని క్లినిక్‌ల సీజ్

అల్వాల్: ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సూచనల మేరకు అనధికార వైద్యులపై రాష్ట్రవ్యాప్తంగా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం అర్హత లేకుండా వైద్యం చేస్తున్న వ్యక్తులపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు క్లినిక్‌లను అధికారులు బృందం మంగళవారం సీజ్ చేసింది. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో నెట్టి అక్రమంగా వైద్యం నిర్వహిస్తున్న ఈ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. మల్కాజిగిరి డివిజన్ ఉప జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ శోభారాణి, డాక్టర్ వినోద్, డీపీఎంఓ జోసెఫ్, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో సమస్యలకు పరిష్కారం

మేడిపల్లి: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదతో కలిగే ఇబ్బందులను ఎదుర్కొనేందుకు మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, అధికారుల ముందస్తు కార్యచరణపై కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వివిధ కాలనీలో అధికారులు బకెట్ క్లీనింగ్ పనులను చేపట్టారు. ఈ క్రమంలో డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలించిన ఆయన సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ డీఈ సాయినాథ్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లింగస్వామి సిబ్బంది కాలనీ ప్రజలు తదితరులున్నారు.

ప్రణాళికతో అద్భుత విజయాలు



రామంతాపూర్ : గణేష్‌నగర్‌లోని ఆటానమస్ అరోరా పీజీ కళాశాలలో అన్వేషణ టెక్నో కల్చర్‌ఫెస్ట్‌ను నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ శ్రీరాములు రీచ్ గ్లోబల్ ఫౌండర్ సీఏస్ భవానీ చందోలు, కంపెనీ డైరెక్టర్ రోహిత్ పడియాలు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో మంచి ప్రణాళికలతో సులభంగా విజయాలు సాధించవచ్చన్నారు. యువత సోషల్ మీడియాకు బానిసలుగా కాకుండా స్టార్టప్ రూపొందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు.



అలరించిన నాట్యోత్సవం

ఉప్పల్: ప్రపంచ నాట్య దినోత్సవం సందర్భంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో మంగళవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రమాదేవి శిష్యబృందంచే నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన, పుష్పాంజలి, జతిస్వరం, మల్లారి, కొండల్లో నెలకొన్న, మైసూర్ జతి, కృష్ణాష్టకం, గజవదనం, నర్తన లాంటి కార్యక్రమాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు ఇప్పిస్తానని మోసం..

ఇద్దరు నిందితుల రిమాండ్


మేడిపల్లి: మేనేజ్‌మెంట్ కోటాలో ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన బానోత్ రవి, ఎల్‌బీనగర్‌కు చెందిన మంగిలాల్ ఇద్దరు కలిసి పీర్జాదిగూడకు చెందిన మాచర్ల రాము, బాబుస్వామి, చిర్రగోని నరేష్ కుమారులకు మేనేజ్‌మెంట్ కోటాలో ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తామని మాయమాటలతో నమ్మించి నకిలీ ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ఆర్డర్ కాపీ చూయించి వారివద్ద నుంచి రూ.6,50,000 తీసుకున్నారు. ఆర్డర్ కాపీలు నకిలీవని, తెలియడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించామని, వీరికి సహకరించిన మరో వ్యక్తి సత్యనారాయణ పరారీలో ఉన్నట్లు సమాచారం.




నిందితుడు మంగిలాల్ బానోత్ రవి

మురుగు.. పరుగు !

● ఇబ్బంది పడుతున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు



అన్నపూర్ణ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ సొసైటీలో రోడ్డుపై నిరంతరం మురుగు ఏరులై పారుతోంది. ఏళ్ల తరబడి నిత్యం మురుగు రోడ్లపై పారుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అన్నపూర్ణ సొసైటీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా తమ పరిధి కాదంటూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి.

☛ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మహేంద్ర హిల్స్ నుంచి మల్కాజిగిరి నియోజకవర్గం అయిన అన్నపూర్ణ సొసైటీ కాలనీ మీదుగా మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దశాబ్దకాలంగా ఎగువ ప్రాంతమైన మారేడ్‌పల్లి, మహేంద్రహిల్స్ నుంచి శివగంగా మీదుగా అన్నపూర్ణ సొసైటీలో ఉన్న రజకసంఘం నుంచి డ్రైనేజీ నీరు జయగిరి లక్ష్మీనరసింహస్వామినగర్, గోపాల్‌నగర్, జ్యోతి నగర్, మిర్జాలగూడ మీదుగా పైపులైన్ ద్వారా మురుగు ప్రవాహం ఉంటోంది.

పెరిగిన జనాభాకు అనుగుణంగా సౌకర్యాలలేమి..

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచకపోవడంతో మురుగు ప్రవాహం అధికమై లీకేజీలు ఏర్పడుతున్నాయి.

దుర్వాసనతో ఇబ్బంది..

గత రెండేళ్లుగా మురుగు రోడ్డుపై ప్రవహిస్తుందని దీనివల్ల దుర్వాసన వెదజల్లి, ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని అన్నపూర్ణ సొసైటీ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బంది పడుతున్నారని, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయంతో దశాబ్దకాలంగా నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.